నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శుక్రవారం | 04 ఏప్రిల్ 2025 | పేజీలు 8

# పౌర సరఫరాల శాఖ ద్వారా జొన్నల కొనుగోలు

- క్వింటాలుకు రూ.3,371 మద్ధతు ధర
- రైతులు ఉపయోగించుకోవాలని కోరిన జాయింట్ కలెక్టర్





**కర్నూలు, మేజర్‌న్యూస్ :** జొన్నలకు గిట్టుబాటు ధర దొరక్క ఇబ్బంది పడుతున్న రైతాంగం నుండి ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేయబోతోంది. హైబ్రిడ్‌రకం (సి 42/మహింద్రరకం) జొన్నల కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్ధతు ధర క్వింటాలుకు 3,371 రూపాయల చొప్పున పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేస్తుందని ఆమె చెప్పారు. రైతులు తమ సమీప రైతు మిగతా 2లో

### వైభవంగా కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కుమార్తె

# వివాహ వేడుకలు

- నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగర శివారులోని జిఆర్‌సి కన్వెన్షన్ హాల్‌లో కోడుమూరు వైసిపి నేత, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కుమార్తె శ్రేయ, వివేకానంద విరుపాక్షల వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు నంద్యాల జిల్లా వైసిపి అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, నగర మేయర్ బివై రామయ్య, ఎమ్మెల్యేలు విరుపాక్షి, బాలనాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, శిల్ప చంద్రకిషోర్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, సుధీర్, హఫీజ్ ఖాన్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మిగతా 2లో



నూతన వధూవరులతో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు



# అంజన్న భూమి అనుభవదారులకేనా..!!

- ప్రభుత్వ రీ సర్వేకు సహకరించేది ఎవరు..?
- అనుభవదారులకు అధికారులు సహకారం ఉందా..!!
- రెవెన్యూ అధికారుల నోటీసులకు దేవాదాయ అధికారులు తూట్లు
- కనీసం అందుబాటులోకి రాని మండల దేవాదాయ అధికారి..!!
- పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నదికైరవాడి గ్రామస్తులు

**నందవరం, మేజర్‌న్యూస్ (ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి) :** గడప ఉన్న ప్రతి గ్రామ ఇలవేల్పు అయిన అంజానపుత్రుడు అదే నండి శ్రీ ఆంజనేయస్వామికి ఉన దేవాదాయ భూములు అనుభవదారులకు కట్టబెట్టనున్నారా.. అంటే అవుననే సమాదానం దేవాదాయశాఖ అధికారుల నిర్వాకానికి పరాకాష్టగా నిలువనున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న భూసర్వేకు రెవిన్యూ అధికారులు దేవాదాయ శాఖ మండల స్థాయి అధికారులకు సమాచారం అందించినా నిమ్మకు నీరెత్తనట్లు ఉండటం ఇందుకు బలం చేకూరుతుంది.ఏళ్ల తరబడిగా దేవాదాయ( దేవుని ) భూములను అనుభవిస్తున్న ఆ నలుగురు దేవుని మాన్యం భూములు అనుభవం ఉన్న వారిచేతుల్లోకి మిగతా 2లో



### చంద్రబాబును ముస్లిం సమాజం

# క్షమించదు

- టీడీపీ,జనసేనాకు చిత్తశుద్ధి ఉంటే వక్ఫ్ బిల్లు వెళ్లేదా...!!
- మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్



మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

**కర్నూలు స్పోర్ట్స్, మేజన్‌న్యూస్ :** వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన చంద్రబాబును ముస్లిం సమాజం క్షమించబోదని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్ నందు హఫీజ్ ఖాన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు విషయంలో ముస్లింల పట్ల తెలుగు దేశం పార్టీ నమ్మక ద్రోహానికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం సమాజం పట్ల చంద్రబాబుకు ఉన్న వ్యతిరేక వైఖరి ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా స్పష్టమైందన్నారు. మిగతా 2లో

### వసతి గృహాన్ని

# న్యాయమూర్తి తనిఖీ

సౌకర్యాలు బాగా లేవని ఫిర్యాదు చేసిన నిరాశ్రయులు



**కర్నూలు లీగల్, మేజర్ న్యూస్ :** కర్నూలు నగర పరిధిలోని ఇందిరా గాంధి నగర్ నందు గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు.కార్యాలయాలకు సంబంధించిన రిజిష్టర్‌లను సక్రమంగా మిగతా 2లో

### మహానంది మండలంలో

# భారీ వర్షం

2లో

- తీవ్రంగా నష్టపోయిన రైతన్నలు




తడిసి ముద్దయిన పసుపు పంట

# అంజన్న భూమి అనుభవదారులకేనా.. !!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నారా అనే అనుమానాలు భూసర్వేలో దేవాదాయ అదికారుల చేస్తున్న వైకరి పట్లనే అర్థం అవుతున్నాయి. నందవరం మండలం నదికైరవాడి గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయభూములు అనుభవదారుల నుండి రక్షించే నాథుడే లేరా అని గ్రామస్తులు మండి పడుతున్నారు.దేవుని భూములు కాపాడుతారా.. అనుభవదారులకే అంటగడతారా అనేది దేవాదాయశాఖ అధికారులకు తీరుకే వదిలేయ్యాలి.. ఇంతకూ ఎందుకు ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూసర్వేకి రెవిన్యూ అధికారులు నోటీసులు అందించే ప్రయత్నాలు చేస్తున్నా దేవాదాయ వాక అధికారులు అందుబాటులోకి రావడంలేదని తెలుస్తుంది.. దీంతో అంజనేయస్వామి భూమి దాదాపు 24 ఎకరాలు అనుభవదారులకు దక్కతుందా అనే అనుమానాలకు కాపాడుకోలేని దేవాదాయ శాఖ అధికారులు తీరు బలం చేకూరుతుంది..

**మాన్యం ఉన్నా దీప, దూప నైవేద్యం కరువు :** నందవరం మండల నదికైరవాడి శ్రీ ఆంజనేయ స్వామి భూమి సర్వే నెంబర్ 4 నందు 23. 84 ఎకరములు కలదు.. అది కూడా తుంగభద్ర నది జలాలతో సాగునీరు అందుతున్న నేపద్యంలో ఏటా రెండు పంటల పండుతున్న పేపద్యంలో కౌలుకు బలే గిరాకి ఉంటుంది.. కాని అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లుగా అంజన్న భూమిని ఏకంగా ఓ నలుగురు ఏకమై స్వామి వారి భూమిని అప్పనంగా అనుభవించడం జరుగుతుంది.. దేవుని భూమిని అనభవిస్తున్నా కానీ కనీసం స్వామి వారి ఆలయంలో కనీసం దూప, దీప, నైవేద్యం కురువు చేశారు.. ఈ విషయాల్లోని వాస్తవాలను గ్రామస్తులు తెలుపుతున్నారు. కనీసం కౌలుకు ఇస్తే ఆలయ భూమి నుండి ఎకరానికి ఏటా 25 వేల రూపాయలు ఉంటుందని అంచనా.. దీనిద్వారా లెక్కల ప్రకార ఏటా 5 లక్షల రూపాయలు ఏమైపోతున్నాయి అనేది కనీసం దేవాదాయ శాఖ అధికారులు లెక్కలు తేల్చడం లేదంటే స్వామి భక్తి ఆ శాఖ అధికారులు ఎంత ఉందో అద్దం పడుతుంది.

**ఆ నలుగురి చేతిలోనే ఆలయ భూమి ..!! :** తుంగభద్ర నది వరదలకు ఊరు మూడు మూడు ముక్కలు అయినా .. గ్రామానికి చెందిన ఇద్దరు.. సెటిలర్ గ్రామం అయిన ఐ. కొట్టాలకు చెందిన మరో ఇద్దరు స్వామి వారి ఆస్తులను అప్పనంగా ఆరు ఎకరాల మేర ఏళ్ల తరబడి గా అనుభవించడంమే కాక ఏకంగా స్వామి వారి భూమిని అనుభవం కింద రెవిన్యూ రికార్డులు మార్చుకున్న ఘణులుగా మిగిలారు.. గ్రామంలో ప్రజాప్రతినిధులు ఇటు రెవిన్యూ , అటు దేవాదాయ అధికారులకు పిర్యాదులు చేసినా ఇన్నెళ్లు పట్టించుకున్న పాపాన పోలేదన్నది అర్థం అవుతుంది.


**ప్రభుత్వ సమగ్ర భూసర్వేతోనైనా దేవుని మాన్యం కాపాడతారా..? :** నందవరం మండలం నదీకైరవాడి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ భూములను అనుభవదారులనుండి రెవిన్యూ రికార్డులు నుండి ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేలో అయినా దేవాదాయ అధికారులు కాపాడే పరిస్థితులు తీసుకొస్తారా అంటే వారు ఇంత వరకు రెవిన్యూ అధికారులకు కనీసం సహకారం అందించడంలేదు అన్నది తెలుస్తుంది.. మండల రెవిన్యూ అధికారులు మండల ఎండోమెంట్ అధికారిని సంప్రదించే యత్నాలు చేస్తున్నా అందుబాటులోకి రావడంలేదని సమాచారం.. వారు ఇలా ఉన్న నేపద్యంలో అంజన్నా మీ భూములు కాపాడే వారు ఎవరున్నారు అనే ఆవేదన గ్రామస్తులను మనస్థాపానికి గురి చేస్తుంది..

**భూమి విలువ రూ. కోట్లు.. కాపాడేది ఎవరు..? :** మంత్రాలయం – కర్నూలు రహదారిలో స్వామి వారి ఆలయ భూమి ధరలు కోట్లకు పలుకుతున్నాయి.. ఎకరానికి దాదాపు మార్కెట్ రేట్లు బట్టి చూస్తే ఎకరానికి 40 లక్షల మేరకు పలుకుతుంది. అంతటి విలువలు కలిగిన భూములు అనుభవదారుల చేతిలో ఏమైపోతుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. ఇంతటి విలువైన భూములను కాపాడే వారు ఎవరున్నారని గ్రామంలో ఆవేదన వ్యక్తం అవుతున్నాయి..

# చేనేతల అభ్యున్నతే లక్ష్యం..ఎమ్మెల్యే బీవీ

**77 ఎకరాలలో టెక్స్ టెల్ పార్క్ ఏర్పాటు**

**ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** చేనేతల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామని, చేనేతకు పుట్టిల్లు అయిన ఎమ్మిగనూరు చేనేతలు నాణ్యమైన వస్త్రాల తయారీలో ఇంకా పాత పద్ధతిలో ఉన్నారని దీనిని తొలగించాలన్నదే తన తపన అని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి అన్నారు. చేనేత వస్త్రాల తయారీలో వివిధ డిజైన్లతో కూడిన నాణ్యమైన వస్త్రాలను తయారు చేయగలిగితే వాటికి మార్కెట్లో గుర్తింపు, మంచి ధర లభించి చేనేతల ఆర్థిక స్థితిగతులను మార్చే అవకాశం ఉందని ఈ దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే బీవీ పిలుపు నిచ్చారు. ఫ్యాషన్ డిజైనర్ చంద్రిక ప్రధాన హీరోయిన్లు, పెద్దపెద్ద నాయకులు, వ్యాపారవేత్తలకు ఫ్యాషన్ డిజైనర్గా పనిచేస్తున్నారని, అలాంటి ఆమె ఎమ్మిగనూరు రావటం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని అన్నారు. గుంత మగ్గాలు పోయి కొత్త ఫ్రేమ్ మగ్గాలు రావాలని వాటి ద్వారా కొత్త కొత్త డిజైన్ తో కూడిన వస్త్రాలు తయారు కావాలని వాటిని మార్కెటింగ్ చేసి చేనేతలు మంచి ఆదాయం పొందాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రధానంగా బనవాసి సమీపంలో 77 ఎకరాలలో టెక్స్ టెల్ పార్క్ ఏర్పాటు జరుగుతుందని అక్కడే అప్పిరల్ పార్కు కూడా ఉంటుందని వీటివల్ల చేనేతలకు నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే బీవీ వివరించారు. తన తండ్రి మాజీ మంత్రి దివంగత బీవీ. మోహన్ రెడ్డి పేరుతో ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా చేనేత వస్త్రాలకు వివిధ రకాల డిజైన్స్ అందించే వారిని పిలిపించి చేనేతలకు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని ఎమ్మెల్యే బీవీ తెలిపారు.ఫ్యాషన్ డిజైనర్ చంద్రికరామ్ మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ ఒక్కటే కాదని నూతన డిజైనింగ్, ఎంబ్రాయిడర్, ప్రింటింగ్, నాణ్యతతో తయారీ కొత్త టెక్నిక్ లతో తయారయ్యే ప్రతి వస్త్రం ఆకర్షణంగా ఉంటుందన్నారు. అందమైన చీరను అంతకుమించి అందమైన హీరోయిన్ ధరిస్తే చీరకు విలువ పెరగటంతో పాటు గౌరవంఉంటుందనితద్వారా చేనేతకుగుర్తింపులాభము లభిస్తుందని ఆమె వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ సతీమణి నిత్యాదేవి రెడ్డి మాట్లాడుతూ చేనేత వస్త్రాలను నేసే వారిలో మహిళలే అధికంగా ఉన్నారని వారికి ఒకసారి వస్త్రాల తయారీలో డిజైనింగ్ లో శిక్షణను ఇస్తే అందులోనూ వారు గొప్పగా రాణిస్తారని తెలిపారు. ఫ్యాషన్ డిజైనర్ గా వచ్చిన చంద్రిక ఎమ్మిగనూరులోని చేనేతలకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇకపై మహిళలకు తాను ఇంటి వద్ద అందుబాటులో ఉంటానని వారు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చుని నిత్యాదేవి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జౌళి శాఖ అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుబయటనే విద్యుత్ బిల్లులు చెల్లింపు

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** ప్రతి నెలనెల విద్యుత్ వినియోగదారులు నేరుగా విద్యుత్ కార్యాలయంకు వెల్లి అక్కడ అధికారులకు కరెంటు బిల్లులు చెల్లిస్తారు. అయితే మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామంలో విద్యుత్ శాఖసిబ్బంది మాత్రం ఆర్టీసీ బస్టాండ్లో ఓ మూలన కూర్చోని విధ్యుత్ విని యోగా దారులనుండి కరెంటు బిల్లులు కట్టించు కుంటున్నందున అటు వినియోగ దారులు ఇటు సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సు ప్రాంగణంలో అధికారులు కరెంటు బిల్లులు కట్టించు కోవడం ఏమిటని అటుప్రజలు. ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పెద్దకడుబూరు గ్రామంలో కరెంటు సర్వీసులు వేలాదిగా ఉన్నందున కరెంటు బిల్లులుచెల్లించాడానికి కొందరు ముందుకు రాలేక పోతున్నారని పలువురు అభిప్రాయం పడుతున్నారు. అలాగే మండల కేంద్రంలో ప్రత్యేకంగా కరెంటు ఆఫీసు ఏర్పాటు చేస్తే సిబ్బంది కి. విద్యుత్ వినియోగ దారులకు సులభ తరమవుతుందని గ్రామ ప్రజలు అంటున్నారు. అధేవిధంగా విద్యుత్ సమస్య ఏర్పడితే అధికారులు అందరు ఎమ్మిగనూరు కరెంటు కార్యాలయంలో ఉంటున్నందున వినియోగదారులు ఎమ్మిగనూరు పట్టణానికి వెళ్లి అక్కడ అధికారులను సంప్రదించాల్సిఉంటుందని తెలిపారు. ఏది ఏమైనా జిల్లా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మండల కేంద్ర మైన పెద్దకడుబూరు గ్రామంలో కరెంటు ఆఫీసు ఎర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ బిల్లులు కట్టించుకుంటున్న దృశ్యం

# పౌరసరఫరాల శాఖ ద్వారా జొన్నల కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

సేవా కేంద్రాల్లో ఇ-క్రాప్, ఇ-కెవైసి చేయించుకుని పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె చెప్పారు. ఇవి చేయించుకున్న రైతుల నుండే జొన్నలు కొనుగోలు చేస్తామని ఆమె చెప్పారు. జొన్నలు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటేనే కొనుగోలు చేస్తామని ఆమె తెలిపారు. హమాలీలను రైతులు ఏర్పాటు చేసుకుంటే ఆ ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని, గోనె సంచులు, జొటన్నలను రవాణా చేసేందుకు అవసరమైన ఖర్చులను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ భరిస్తుందని ఆమె తెలిపారు. కనీస మద్ధతు ధర మొత్తాన్ని రైతు ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

# వైభవంగా కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కుమారై వివాహ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు తాడేపల్లి ప్యాలెస్ నుండి హెలికాప్టర్ ద్వారా కర్నూలులోని మైఫర్ ఫార్మసీ కాలేజీకి చేరుకున్న మాజీ సిఎం జగన్‌కు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పూలబొకేలు అందచేసి ఘనస్వాగతం పలికారు.



మాజీ సిఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్‌వి మోహన్‌రెడ్డి

# చంద్రబాబును ముస్లిం సమాజం క్షమించదు

(మొదటి పేజీ తరువాయి)

దేశం మొత్తం చంద్రబాబు నిజస్వరూపాన్ని తెలుసుకుందన్నారు. దేశంలోని 9లక్షల ఎకరాల భూమిపై వక్ఫ్‌బోర్డు తన హక్కులను కోల్పోయే పరిస్థితికి కారణమయ్యే ఈ బిల్లును చంద్రబాబు ఎందుకు వ్యతిరేకించలేదన్నారు. 40ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు బిజెపి ప్రభుత్వం ముస్లింలపై ఇంత కుట్ర చేస్తుంటే ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కీలకమైన సంఖ్యా బలం ఉన్న చంద్రబాబు ప్రారంభంలోనే ఈ బిల్లును అడ్డుకుని ఉంటే జెపిసి దాకా బిల్లు వెళ్లేదా అని ప్రశ్నించారు. మరోవైపు వక్ఫ్‌బోర్డు బిల్లును చంద్రబాబునాయుడు అడ్డుకుంటాడని జాతీయ మీడియాలో అనుకూలమైన అపద్దపు ప్రచారాన్ని ఘనంగా చేయించుకున్నారన్నారు. వైసిపి ఈ బిల్లును ప్రజాస్వామ్య విధానాలలో అడ్డుకుంటుందన్నారు. ఎన్నో ఇబ్బందులు ఉన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనర్లకు జరుగుతున్న అన్యాయాన్ని తిప్పికొట్టాలనే నిర్ణయానికే కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. బిజెపి ఏనాడు ముస్లింలకు అనుకూలంగా వ్యవహరించలేదని, ఎన్‌డిఏ పాలనలో ఏ ఒక్క ముస్లిం మైనార్టీలను రాజకీయంగా ప్రోత్సహించిన దాఖలాలు లేవన్నారు. వందల సంవత్సరాల నుంచి దేశంలో అన్ని మతాల వారు కలిసిమెలసి జీవిస్తున్నారని వక్ఫ్‌బోర్డులో మాత్రం ఇతర మతస్తులను పెట్టి నామినేటెడ్ పదవులను కేటాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ముస్లింలకు న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. తాజా సవరణతో ముస్లింలుగా కనీసం ఐదేళ్లు ఉన్న వారే ఇలా దానం చేయడానికి అర్హులని నిబంధనలు పెట్టడం దారుణమన్నారు. దేశంలోని అన్ని దర్గాలకు మతాలకు సంబంధం లేకుండ భక్తులు వెళుతుంటారు. వారి అనుకూలతను బట్టి భగవంతుడికి కానుకలు, చందాలను సమర్పిస్తుంటారని వాటిని కూడా మతం కోణంలో చూడడం దుర్మార్గమన్నారు.


# వసతి గృహాన్ని న్యాయమూర్తి తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించడం లేదని గుర్తించి అక్కడి నిర్వాహకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉండే ప్రతిఒక్కరిని వారికి అందించే భోజన వసతి సదుపాయాలను, వైద్య సదుపాయల గురించి ప్రశ్నించారు. అక్కడి సౌకర్యాలు బాగా లేవని నిరాశ్రయులు తెలిపారు. వారికీ వుండే చట్ట పరమైన హక్కుల గురించి వివరించారు. అనంతరం జడ్జి సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడి సౌకర్యాలను మెరుగు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

# మహానంది మండలంలో భారీ వర్షం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలో కురిసిన భారీ వర్షానికి ప్రకృతి చల్లబడినా రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత నెల రోజులుగా భానుడి భగ భగలకు ఉక్కిరి బిక్కిరైన ప్రజలు వాతావరణం చల్లబడటంతో కొంత ఉపసమనం పొందారు. పసుపు, మొక్కజొన్న, వరి పండించే రైతులు అకాల వర్షానికి నష్టాల ఊబిలోకి వెళ్ళినట్లు రైతన్న వాపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించుకున్న పంట అకాల వర్షంతో తడిసి ముద్దవ్వడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతన్న ఆందోళన చెందుతున్నారు. అసలే గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోతున్న రైతన్నకు మూలిగేనక్కపై తాడిపండు పడ్డ చందంగా ఈ అకాల వర్షం తోడైందని రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల వెంట ఆరబోసుకున్న మొక్కజొన్న పంట, పొలాల్లో ఉడికించేందుకు ఆరబోసుకున్న పసుపు పంట, వరి ధాన్యం ఈ అకాల వర్షంతో తడిసి ముద్దయిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



# ఉరుములు,పిడుగులతో భారీ వర్షాలు

**పిడుగులు, మెరుపులతో.. అరుగురికి గాయాలు**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామంలో గురువారం ఉరుముల మెరుపు దాడిలో అరుగురు గాయపడిన ఘటన చోటు చేసుకొంది. గురువారం సాయత్రం కురిసిన పిడుగులు, మెరుపులతో కూడిన వర్షం నుండి తప్పించుకొనుటకు ఇనగండ్ల క్రాస్ బస్ స్టాప్ లో 50 మందికి పైగా ఆశ్రయం పొందుతుండగా. ఒక్కసారిగా ఉరుములు మెరుపులు భారీ శబ్దంతో బస్టాండ్ పై పడింది, దీనితో ముందు వరసలో వున్నా ఆరుగురు వ్యక్తులకు ప్రమాదం సంబవించి గాయపడినట్టు సమాచారం. గాయపడిన వారిలో స్థానిక ఇనగండ్ల గ్రామానికి చెందిన రాఘవేంద్ర,దేవావరం, సుధాకర్, లక్ష్మినారాయ, దస్తగిరి, ధనుంజయ్, కం పాడు నరసింహుడు,కోడుమూరు మం డలం అనగొండ గ్రామానికి చెందిన లక్ష్మన్న లుగా పేర్కొన్నారు.వీరిలో ఐదుగురుని వైద్యం నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కు పోలకల్ డా,, చిన్న తిమ్మప్ప తరలించినట్టు సమా చారం. వర్షం తగ్గేంత వరకు బస్టాండ్ నం దు ఆశ్రయం పొందుతూండగా ఒక్క సారి గా ఉరుములు మెరుపులు సంబవించడం తో మెరుపు మాపైనే పడిందేమీ అన్నటుగా మెరుపు వేగానికి మాకళ్ళు భైర్లు గమ్మి మేము ఒక్కసారిగా ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయామని, ఐదు నిమిషాల అనంత రం ఒక్కొక్కరుగా మెలుకువ లోకి వచ్చారని ప్రత్యక్ష సాక్షి ధనుంజయ్ తెలిపారు.

**ఘటన స్థలానికి పరిశీలించిన మండలా ధికారులు :** ఘటన సమాచారం అందుకున్న మండల అధికారులు ఇంచార్జి తహశీల్దార్ పురుషోత్తమ్ముడు, ఎంపీడీఓ రాణెమ్మ, ఎస్ఓ. శ్రీనివాసులు,పోలీస్ సిబ్బంది శ్రీని వాసులు ఘటన స్థలానికి చేరుకొని స్థలాని పరిశీలించి ఘటనపై అరాతీశారు, అనంతరం అధికారులు మాట్లాడుతూ ఉరు ములు, మెరుపు ల దాడిలో గాయపడిన వారిని వైద్యం నిమిత్తం కర్నూల్ కు తరలించడం జరిగిందని, వారి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. రాబోయే రెండు రోజులు ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





మెరుపు దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వారిన పరిశీలిస్తున్న ఎస్ఐ. తిమ్మారెడ్డి,డా,, చిన్న తిమ్మప్ప.

# 15 లీటర్ల నాటుసారా స్వాధీనం.. విక్రేతలు అరెస్ట్

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** పట్టణంలో నాటుసారాను విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు డోన్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ, ఎక్సైజ్ ఎస్సై, ఎక్సైజ్ సిఐ ఈఎస్‌టిఎఫ్ వారు, వారి సిబ్బందితో గురువారం నిర్వహించిన దాడులలో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, నలుగురు సారావిక్రేతలను అరెస్ట్ చేసినట్లు డోన్ ఎక్సైజ్ సిఐ వరలక్ష్మి పేర్కొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని చిగురుమానుపేటకు చెందిన కొత్తూరు మౌళాలమ్మ వద్ద నుండి 5 లీటర్ల నాటుసారా, అదేవిధంగా చిగురుమానుపేటకు చెందిన కోయిలకొండ లక్ష్మీదేవి, ఎరుకుల ఆంజనేయ, ప్యాపిలి మండలం, అలేబాద్‌తాండ గ్రామానికి చెందిన శ్రీరాములునాయక్‌ల వద్ద నుండి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వారిపై బైండోవర్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ సిఐ లక్ష్మణదాసు, ఎక్సైజ్ ఎస్సైలు ఓ.సోమవేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ గోపాల్‌సింగ్, ఉమాకాంత్‌రెడ్డి, రంగస్వామిలు పాల్గొన్నారు.



నాటుసారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

# వైన్ షాపుకు లైసెన్స్ మంజూరు చేయండి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** గౌడ సామాజికవర్గ కోటాలో కేటాయించిన తమ వైన్ షాపుకు లైసెన్స్ మంజూరు చేయండనీ టిడిపి నేత వైన్‌షాపు యజమాని ఆర్‌ఈ. రాఘవేంద్ర గురువారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో గల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్సీ బీటి.నాయుడికి వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఈ.రాఘవేంద్ర పట్టణంలోని తారక రామనగర్‌లో వైన్ షాపు ఏర్పాటు చేయగా, ఇదివరకే ఆ ప్రాంతంలో టిడిపిలోని మరో వర్గానికి చెందిన మద్యం దుకాణం ఉండటంతో వారి ప్రోద్భలంతోనే ఆ ప్రాంతంలో మరో దుకాణం ఏర్పాటుకు అనుమతులు రాకుండా ఎక్సైజ్ అధికారులు వేధిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. డోన్ తెలుగుదేశం పార్టీలోని అంతర్గత కలహాల కారణంగా ఇప్పటికే పలు సమస్యలు అమరావతికి చేరగా, తాజాగా మద్యం దుకాణం ఏర్పాటు అంశం అమరావతికి చేరింది.



ఎమ్మెల్సీ బీటి.నాయుడికి వినతిపత్రం ఇస్తున్న ఆర్‌ఈ.రాఘవేంద్ర

# బాలసంజీవినిలో సవరణలు చేయాలి

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** బాల సంజీవినిలో సవరణలు చేయాలని ఏఐటీయుసీ అనుబంధ అంగన్‌వాడి వర్కర్స్ అండ్‌హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు కాంతమ్మ, ఈరమ్మ, సీఐటీయు అంగన్‌వాడి వర్కర్స్ నాయకురాలు పద్మజ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటి నుండి అంగన్‌వాడి కేంద్రాలకు సంబంధించి బాల సంజీవిని కొత్త వర్సన్ 2.0 తీసుకొచ్చి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫోటోలు ప్రీ స్కూలు చిన్నారుల ఫోటోలతోపాటు 15 మ్యాడూల్స్‌లో పనిచేసే విధానాన్ని తీసుకురావడం జరిగింది. ఈ విధానం వలన అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం స్పందించి తక్షణమే సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి నెల నెల వేతనాలు అందేవిధంగా చూడాలన్నారు. అనంతరం అంగన్‌వాడి కార్యాలయంలో సీడీపీఓలకు వినతిపత్రం వారు అందజేశారు. ఏఐటీయుసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టి కంతయ్య, రంగన్న, సీఐటీయు మండల కార్యదర్శి గోపాల్, అంగన్‌వాడిలు తిరుపతమ్మ, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడి నాయకురాలు

# స్పీకర్‌ను దూషించిన కేసులో వైకాపా నేత అరెస్ట్

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని దూషించిన కేసులో నర్సీపట్నం వైకాపా నేత కర్రి శ్రీనివాసరావును గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెలలో ప్యాపిలి మండలం, జలదుర్గం పోలీసుస్టేషన్‌లో స్థానిక ఐటిడిపి నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నర్సీపట్నం వెళ్ళి కర్రి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని గురువారం డోన్ కోర్టులో హజరు పరచగా, రిమాండ్‌కు తరలించారు.



కర్రి శ్రీనివాసరావును డోన్ కోర్టుకు హాజరుపరుస్తున్న పోలీసులు

# జనన, మరణ వివరాలను పదిరోజుల్లో పంపాలి

**– నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె విశ్వేశ్వర్‌రెడ్డి**

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ ః** నగరంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో సంభవించిన జననాలు, మరణాల వివరాలను పదిరోజుల్లోగా నగరపాలక సంస్థకు పంపాలని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె విశ్వేశ్వర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. వివరాలను పంపడంలో జాప్యం చేస్తే ఒక్కొక్క జననము, మరణము మీద రూ.2వేలు జరిమానా విధించడం జరుగుతుందని ఆ రుసుమును సంబంధిత ఆసుపత్రి యాజమాన్యమే భరించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ఆ రుసుమును యాజమాన్యం ప్రజల నుండి వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే ఆ ఆసుపత్రిని సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్, డిఎంహెచ్‌ఓలకు సిఫార్సు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్ బ్యాక్ 10వరకు పొడిగింపు :– దేశవ్యాప్తంగా నగరాల్లో, పట్టణాల్లో స్వచ్ఛత పనులపై అభిప్రాయాలను సేకరించేందుకు చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్ ఫీడ్ గడువును ఏప్రిల్ 10వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించిందని ప్రజారోగ్య అధికారి తెలిపారు. ఇంకా ఫీడ్ బ్యాక్ ఇవ్వని పౌరులు తక్షణమే వెబ్‌సైట్ ద్వారా అభిప్రాయాలను తెలిపి నగరాన్ని జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు సహకరించాలని ప్రజారోగ్యాధికారి కోరారు. .

# విద్యార్థినీలకు స్కాలర్‌షిప్ అందించిన మలబార్ గోల్డ్



విద్యార్థినీలకు స్కాలర్‌షిప్ అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, మలబార్ గోల్డ్ ప్రతినిధులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** 2024–2025 సంవత్సరానికి గాను కర్నూలు మలబార్ గోల్డ్ వారు ప్యాపిలి ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థినీలు 10 మందికి రూ.88వేలు స్కాలర్‌షిప్ అందించారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక కళాశాల యందు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కర్నూలు మలబార్ గోల్డ్ ప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థినీలకు స్కాలర్‌షిప్‌ను అందించారు. అనంతరం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థినీలు ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించినందుకు ప్రోత్సాహకంగా ఈ నగదు వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో సాధించిన మార్కులకి అనుగుణంగా వీరికి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేశామని మలబార్ గోల్డ్ ప్రతినిధులు పేర్కొన్నారు. 80శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినీలకు రూ.10వేలు, 70శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినీలకు రూ.8వేలు చొప్పున వారికి నగదు బదిలీ చేయడం జరిగింది. పేద విద్యార్థినీలకు ఆర్థికంగా సహాయసహకారాలు అందజేసిన మలబార్ గోల్డ్ కర్నూలు వారికి కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపక, అధ్యాపకేతర, సిబ్బంది మరియు విద్యార్థినీల తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మలబార్ గోల్డ్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థినీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కౌలు చట్టంలో మార్పులు చేయండి

**– కౌలు రైతులందరికీ ప్రభుత్వ పథకాలన్నీ వర్తింప చేయాలి**
**– కౌలు రైతు సంఘం డిమాండ్**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది సంఖ్యలో ఉన్న కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కౌలు చట్టంలో మార్పులు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా సమావేశం నంద్యాలలోని నరసింహయ్య భవన్‌లో మార్క్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కౌలు రైతుల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి కౌలు రైతులందరికీ ప్రభుత్వ పథకాలన్నీ వర్తింప చేయాలని అన్నారు. ప్రభుత్వ పాలకులు ఎవరు మారినా కౌలు రైతుల జీవితాల్లో మార్పు రావడంలేదని, ఎన్నికల సమయాల్లో కౌలు రైతుల గురించి గొప్పగా మాట్లాడడం తప్ప ఆచరణలో వారికి వరగబెట్టిందేమీ లేదని అన్నారు. కౌలుదారుల గుర్తింపు కార్డులు ఇవ్వడం కోసం భూయజమాని సంతకం ఖచ్చితంగా అవసరమని చట్టాలు చేయడం వల్ల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు దక్కడం లేదని, వారికి ఏలాంటి ప్రభుత్వ పథకాలు నోచుకోవడం లేదని, అందువల్ల కౌలు చట్టంలో మార్పులు చేయాలని, గతంలో గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించే వారని, వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు ఇచ్చేవారని, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట భీమా మొదలగు ప్రభుత్వ సహాయం అందేవన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూయజమాని సంతకంతో పాటు రూ.10 స్టాంపు కాగితంపై అగ్రిమెంట్ ఖచ్చితంగా ఉండాలని నిబంధన పెట్టడం వల్ల సొంత భూమిగల రైతులు ఎవరూ సంతకం పెట్టడం లేదని, ఫలితంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందడంలేదని ఆరోపించారు. గుర్తింపు కార్డు లేదనే నెపంతో ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు అందడంలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమన్న, సంఘం జిల్లా నాయకులు నరసింహులు, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, ఏలియా, నాగేష్, వరాలు, పాములేటి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

# రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నదే ఎమ్మెల్యే ధ్యేయం

## – ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆరుకాలం కష్టపడిన రైతు గిట్టుబాటు ధర లేక నష్టపోకూడదనే సంకల్పంతో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని టిడిపి సీనియర్ నాయకులు వంగాల శివరామిరెడ్డి, గోవింద రెడ్డి, టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్‌లు అన్నారు. గురువారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు అర్బన్ రైఉ సేవా కేంద్రంలో కనీస మద్దతు ధర కల్పిస్తు మినుము, కంది, శనగ పంటల కొనుగోలు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆయన తండ్రి బుడ్డా వెంగళరెడ్డి ధ్యేయమని, అందుకు సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి బుడ్డా వెంగళ రెడ్డి పునాది వేస్తే , మొక్కవోని దీక్షతో సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగునీటిని అందించిన ఘనత బుడ్డా కుటుంబానిదేనని అన్నారు. రైతుల కోసం అహర్నిశలు శ్రమించే ఏకైక కుటుంబం బుడ్డా కుటుంబం అని అన్నారు. రైతులు సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే ఎమ్మెల్యే బుడ్డా



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనే మార్కెట్‌ఫెడ్ ఆధ్వర్యంలో మినుము, కంది, శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. రైతుల కోసం అహర్నిశలు పనిచేసే బుడ్డాకు ప్రతి రైతు రుణపడి ఉంటామని, రైతుల తరుపున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కందులు క్వింటాల్ రూ.7550, మినుములు రూపే. 7400, శనగలు రూ. 5650 కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎస్పి ప్రాజెక్టు కమిటి చైర్మన్ మల్లికార్జున రెడ్డి, మార్కెట్‌ఫెడ్ డిస్టిక్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, ఎడిఎ ఆంజనేయ, ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి నాయకులు అబ్దుల్లాపురం బాష, రమణ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ కాళికామాత, శ్రీ వీరభద్రస్వామిల కళ్యాణోత్సవం

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఎద్దుల దొడ్డి గ్రామంలో శ్రీ కాళికామాత, శ్రీ వీరభద్ర స్వామి ల కళ్యాణ రథోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. వేకువజామున 4.05గంటలకు శ్రీ కాళికామాత, శ్రీ వీరభద్రస్వా ముల కళ్యాణోత్సవ వేడుకలు వేలాదిమంది భక్తుల మధ్య నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవ వేడుకలకు స్థానిక ప్రజలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు హాజరై స్వాముల వారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు వీరభద్ర స్వామి రథోత్సవ వేడుకలు అశేష భక్తజనం మధ్య కన్నుల పండువగా జరిగింది. రథోత్సవం సందర్భంగా ఎస్ఐ కృష్ణమూర్తి ఆద్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాముల విజయ్, వైస్ ఎంపిపి మల్లికా ర్జునరెడ్డి, రథోత్సవం చేయించిన దాత స్వర్గీయ డీలర్ రంగన్న మనువడు మాజీ సర్పంచ్ చక్రాల వీరేష్, సింగల్‌విండో మాజీ అధ్యక్షులు వైవి ప్రభాకర్‌రెడ్డి,



టిడిపి నాయకులు ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడ్, వీరేష్‌గౌడ్, పెడసాని రామానాయుడు, వైసిపి నాయకులు విజయ భూపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గీతా, విఆర్‌ఓ తిమ్మయ్య, నిర్వాహకులు పులికొండ, ఫీల్డ్ అసిస్టెంట్ రామనాథ్ రవికుమార్, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కనీస మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం జొన్నలు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371లు రైతు లందరూ జొన్నలను పౌర సరఫరాల సంస్థ ద్వారా ప్రభుత్వ కనీస మద్దతు ధరకు విక్రయించాలన్నారు. రాష్ట్ర పౌర సరఫ రాల సంస్థ ఇచ్చిన ఆదేశా ల ప్రకారం నంద్యాల జిల్లాలో పండించిన జొన్నలు హైబ్రిడ్ రకం సి-43 మహేంద్ర జొన్నలను ప్రభుత్వం కనీస మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. రైతులందరూ తమ సమీప రైతు సేవా కేంద్రాలలో ఈక్రాప్, ఈకేవైసీతో పాటు తమ పేర్లను నమో దు చేయించుకోవాలన్నారు. నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే కొనుగోలుకు అర్హులన్నారు. హమాలీలను రైతులే ఏర్పాటు చేసుకుంటే హమాలీ ఖర్చులను ప్రభుత్వమే అదనంగా ఇస్తుందన్నారు. గోనె సంచులను, జొన్నలను రవాణా చేయడా నికి రవాణా ఖర్చులను పౌర సరఫరాల సంస్థ భరిస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర మొత్తాన్ని రైతుల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు.

# శ్రీశైలంలో ఈనెల 5న స్వర్ణ రథోత్సవం



**శ్రీశైలం,మేజర్ న్యూస్ :** ఆరుద్రా నక్షత్రం రోజున శ్రీశైలంలో శ్రీ స్వామి అమ్మవార్లకు స్వర్ణ రథోత్సవం జరి పించబడుతోందని, ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న ఉదయం ఈ స్వర్ణ రథోత్సవం కార్య క్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపా రు.గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి నందిమండపం నుంచి గంగాధర మండపం వరకు ఈ స్వర్ణరథోత్సవం జరగనుంది. అంతకంటే ముందు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ పూజలు జరిపిస్తారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

# వక్ఫ్‌బిల్లు పై రాజ్యాంగ దాడి

## – మైనార్టీ సెల్ చైర్మెన్ ఖాజా

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** వక్ఫ్‌బిల్లును రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంపై దాడిగా అభివర్ణిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ ఖాజా హుస్సేన్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బిల్లు రాజ్యాంగాన్ని నీరుగార్చే ప్రయత్నమని, మైనార్టీలను అప్రతిష్ట పాలు చేయడం, సమాజాన్ని విభజించడం, ముస్లింల హక్కులను హరించడమేనని అన్నారు. వక్ఫ్‌కు ఒక ముస్లిం ఆస్తిని విరాళం ఇవ్వాలంటే కనీసం ఐదేళ్లు ముస్లిం మతాన్ని ఆచరించినట్లు ధృవీకరించాలనడం అత్యంత దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ బజారన్న, ఐఎన్‌టియుసి



మాట్లాడుతున్న మైనార్టీ సెల్ చైర్మన్ ఖాజా

జిల్లా అధ్యక్షుడు బతుకన్న, కాంగ్రెస్ నాయకులు రియాజ్ అహ్మద్, సయ్యద్ నవీన్, లాజరస్ అబ్దుల్ హై తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన కెడిబిఏ ప్రధాన కార్యదర్శి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు హరి నాథ్ చౌదరి, వెంకటేశ్వర్లు గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌కు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామన్నరు. సీనియర్, జూనియర్ న్యాయవాదులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతామని తెలిపారు. కోర్టు ఫీజు స్టాంపులు కొరత లేకుండ చూస్తామన్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సెక్రటరీ రవికాంత్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ బాల నరసింహులు, మహిళా ప్రతినిధి హెచ్‌కె అరుణ, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ బెస్త సుధాకర్, సీనియర్, జూనియర్ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు

# ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** పేదప్రజలకు ఉపాధి కల్పించాలనే ఆలోచనలతో చేపడుతున్న ఉపాధి హామీ పనులను అధికారులు, సిబ్బంది బాధ్యతగా నిర్వహిం చాలని పిడి వెంకట సుబ్బయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో గురువారం 2023-24కి సంబంధించి 18వ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా ఉపాధి హామీ నిధులతో 10హామీ వేతనాలకు రూ.12కోట్లు ఖర్చు చేశారని మెటీరియల్ కొరకు రూ.4కోట్లు ఖర్చు చేశారని జరిగిన ఉపాధి హామీ పనులు గుర్తించిన లోటుపాట్లపై సిబ్బందిని వివరణ కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏడాదిలో ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలు రూ.12కోట్ల మెటీరియల్ రూ.4కోట్లు కలిపి మొత్తం రూ.16కోట్ల పనులు జరిగినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందచేయనున్నట్లు వివరించారు. ప్రజావేదిక ద్వారా గత నెల 22వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించిన తనిఖీలకు గాను పాత ఫీల్డ్ అసిస్టెంట్లు మొక్కలు చంపుకున్న రైతులు వాలంటీర్ల ద్వారా రూ.1,73,156 రికవరికీ ఆదేశించినట్లు, రూ.95వేలు పెనాల్టీ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ విజయభాస్కర్, ఐదు మంది డిఆర్‌పిలు, అడిషనల్ పిడి, ఎంపిడిఓ శ్రీనివాసులు, డివిఓ లోకేశ్వర్, ఏపిడి పద్మావతి, సిడిసిఎల్ ఆర్‌సి సుజాత, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

# భూముల రీసర్వేపై గ్రామసభ, ర్యాలీలు

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ముక్కెళ్ల గ్రామంలో భూముల రీసర్వేపై గురువారం ర్యాలీ, గ్రామసభలను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. స్థానిక ప్రజలతో కలిసి రెవెన్యూ అధికారులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం రచ్చబండ వద్ద గ్రామ సభ జరిగింది. ఈ గ్రామసభలో తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను రీ సర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. విఆర్‌ఓలు, సర్వేయర్లు తమ గ్రామంలోని పొలాల్లో రీసర్వే చేస్తారని కావున రైతులు సహకరించి త్వరగా రీసర్వే పూర్తయ్యే విధంగా చూడాలని ఆమె ప్రజలను కోరారు. అధికారులు కూడా తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధుమతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు, మండల సర్వేయర్ సుధాకర విఆర్‌ఓలు పెరవలి రహిమాన్ బాషా, రాతన రంగప్ప, రైతులు పాల్గొన్నారు.



# శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శక్తి యాప్‌పై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాలు గురువారం పోలీస్ అధికారులు నిర్వహించారు. చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై జరిగే నేరాలు, ఈవ్ టీజింగ్ నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు తీసుకొని వచ్చిన భక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. మహిళలు ఏదైనా ప్రమాదంలో ఉన్నప్పుడు తక్షణ సహాయం అందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే సైబర్ క్రైమ్ నేరాల భారీన పడకుండా తమ్మును తాము ఏలా రక్షించుకోవాలో, సైబర్ నేరగాళ్ళ చేతిలో పడి మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని విద్యార్థులకు అవగాహన కల్పించారు.




శక్తి యాప్ గురించి వివరిస్తున్న పోలీస్ అధికారులు

# మానసిక వైకల్యం తొలగించడమే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మానసిక వైకల్యం గల పిల్లలతో కలెక్టర్ రాజకుమారి

- శిక్షణతో అటిజం గల పిల్లల్లో విశేష పురోగతి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**అటిజం (సాధారణ పిల్లల్లా లేకపోవడం) మోటార్ స్కిల్స్ ఆలస్యం వంటి సమస్యలు ఉన్న పిల్లలు సాధారణ జీవితానికి చేరుకోని శారీరక, మానసికంగా అభివృద్ధి చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అటిజం సెంటర్‌ను సందర్శించి పిల్లల ఎదుగుదల గురించి సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అటిజం సంబంధిత వైకల్యంపై ప్రత్యేక శిక్షణ, సరైన మార్గదర్శకత్వం ఉంటే ఈ పిల్లలు సాధారణ జీవనానికి దగ్గరయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తుందని అటిజం కలిగిన పిల్లలకు స్పీచ్ థెరపి, ప్రవర్తన, ఫిజియో థెరపి వంటి సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కేంద్రంలో శిక్షణ



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

పొందిన చాలా మంది పిల్లలు పాఠశాలకు వెళ్లే స్థాయికి చేరుకోవడం, స్వతంత్ర జీవన నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం, ఇతరులతో మెలగడం వంటి అనేక అంశాలలో పురోగతి సాధించారు. డిసిఐ సెంటర్‌లో అందిస్తున్న సేవల వల్ల పిల్లలు విశ్వాసంతో ముందుకు సాగుతున్నారన్నారు.

## నందవరం జ్యోతి మహోత్సవంలో మంత్రి సతీమణి శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి

గండాదీపం( జ్యోతి)ని మోసి మొక్కుచెల్లించుకున్న శ్రీమతి ఇందిరా రెడ్డి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర రోడ్డు భవనాలు మౌలిక సదుపా యాలు ,పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి జ్యోతి మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం నందవరం వచ్చిన శ్రీమతి ఇందిరా రెడ్డి స్థానిక శ్రీ చెన్నకేశవ ఆలయం వద్ద నుంచి (జ్యోతిని) గండాదీపం తలపై పెట్టుకుని పాదయాత్రగా బయలుదేరి అమ్మవారి సన్నిధికి వెళ్లి ఆలయంలో మొక్కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆలయ ఈవో, సహాయ కమిషనర్ జి కామేశ్వరమ్మ, మాజీ ఛైర్మన్ పీవీ కుమార్ రెడ్డిలు



అమ్మవారికి మొక్కు చెల్లించుకుంటున్న బీసీ ఇందిరమ్మ

ఉన్నారు. నూతన తెలుగు ఉగాది శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు, రైతులు ఏలాంటి సమస్యలు లేకుండా పాడిపంటలతో చల్లగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశం

- ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక తయారు చేయండి
- మండల వ్యవసాయాధికారి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఐకేపీ భవనం నందు మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తదనంతరం మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, వెలుగు ఏపీఎం సుగుణపాల్ మాట్లాడుతూ రైతులు ప్రస్తుత వ్యవసాయంలో అధిక రసాయనిక ఎరువులు, పురుగుల మందులను వినియోగిస్తున్నారని, తద్వారా ఆహార ధాన్యాలు, కూరగాయలు, భూమి విషపూరితం అవుతుందని, మానవాళి ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంకు ప్రత్యేక నిధులు కేటాయించిందని, తద్వారా గ్రామాలలో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని వారు కోరారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలను తీసుకోవడం వల్ల ఆరోగ్యం పెంపొందుతుందని, అలాగే నేల కాలుష్యాన్ని తగ్గించవచ్చునని అన్నారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేయగా వాటికి డిమాండ్ ఎక్కువగా ఉందని వారు అన్నారు. భూమి లేని నిరుపేద మహిళలు 365 రోజులు పెరడి తొటలు వేసుకోవాలని, గ్రామస్థాయిలో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడానికి గ్రామ సభలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈశ్వరమ్మ, గోవిందమ్మ అనే రైతులు ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడుల గురించి వారు తెలిపారు. వారికి మండల స్థాయి అధికారులు శాలువలతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహబూబ్‌బాష, నాగేంద్ర, రైతు సేవా కేంద్రం సిబ్బంది అర్పత్, అప్సర్, స్వర్న, కేవీకే శాస్త్రవేత్త భార్గవ్, మహిళా సమాఖ్య అధ్యక్షులు శాంతకుమారి, నాగరత్నమ్మ, వెలుగు వీవోఏలు పాల్గొన్నారు.

# గ్రామంలో ప్రజలు క్రమశిక్షణతో జీవన శైలి మార్చుకోవాలి

- రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** గ్రామాలలోని ప్రజలు ప్రశాంత వాతావరణంలో బ్రతకాలి, అదే సమయంలో క్రమ శిక్షణతో వారి జీవన శైలిని మార్చుకొని అభివృద్ధిలోకి రావాలని నందికొట్కూరు రూరల్ సీఐ టి.సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని భాస్కరాపురం గ్రామంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు గ్రామస్థులకు చట్టాలపై అవగాహన, అలాగే సమస్యలకు ప్రజలు దూరంగా ఉండటం అనే విషయంపై జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ లక్ష్మినారాయణ మాట్లాడుతూ గ్రామాలలో గొడవలకు, సమస్యలకు దూరంగా ఉంటూ మంచి వాతావరణంలో జీవనం సాగించాలని ప్రజలకు సూచించారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా ముందుకు పోలీసుల దృష్టికి తీసుకొని వచ్చి సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, కక్షలు, గొడవలకు పోకుండా చట్టంతో పని చేయించుకోవాలని ఆయన అన్నారు. గ్రామాలలో ప్రతి ఒక్కరూ కష్టపడి సమస్యలను ఎదుర్కొని అభివృద్ధిలోకి వచ్చి మంచిగా జీవనం సాగించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, కోపాలకు, ఆవేశాలకు పోకుండా పిల్లలను మంచి చదువులు చదివించుకొని మంచిగా ఉండాలని, సమస్య వచ్చినప్పుడు ఒకటికి రెండు సార్లు పోలీసుల వద్దకు వచ్చి సమస్యల పరిష్కరించుకోవాలని గ్రామస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సోమన్న, హుసేనయ్య, వీరస్వామి, శివచెన్నయ్య, శ్రీనివాసులు, సంజన్న, సుంకన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదప్రజలకు ఓ వరంలాంటిదని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని మాధవినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సుమారు రూ.16,38,071లు లబ్దిదారులకు పంపిణీ చేశారు. మిడుతూరు గోపాల్‌రెడ్డి రూ.1,17,365లు, బత్తుల మధు ప్రియ రూ.1,77,729, హేత్వికరెడ్డి రూ.74,092, కుమ్మరి చిన్న బజారు రూ.41,500, అవుకు చక్రదరుడు రూ.66,900, చాకలి యశ్వంత్ రూ.39,262, జిల్లా వెంకట రమణ రూ.27,219, వడ్ల శేషకుమారి రూ.37,378, గోపిరెడ్డి రాధమ్మ రూ.37,205, బోయ మద్దమ్మ రూ.33,000, మొహమ్మద్ ఫజిల్ రూ.2,93,630, కె సురేష్ రూ.70,242, ఫలిష అఫ్జీన్ రూ.55,133, బోయ రామకృష్ణ రూ.74,038, వంగాల జయమ్మ రూ.3,91,600, దేశవత్ నాగిబాయ్ రూ.1,01,778లను ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇప్పటివరకు రూ.16,38,071లు వచ్చాయని, లబ్దిదారులకు అందచేశామని తెలిపారు. సిఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు.

# ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు : డ్వామా పిడి



చలివేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డ్వామా పిడి వెంకటసుబ్బయ్య ఎంపిడిఓ శ్రీనివాసులు, ఎంపిపి తిప్పన్న, జడ్‌పిటిసి రంగనాథ్ గౌడ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో వచ్చిపోయే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడమే కాకుండ ఫిల్టర్ నీళ్లు ఉంచి చల్లగా అయిన తర్వాత ప్రజలకు ఇవ్వడం, సమయానికి ముందే ప్రారంభించడం అభినందనీయమన్నారు. రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న వేళ రహదారికి ఆనుకుని చలివేంద్రం పెట్టడం, చలివేంద్రంలో క్రమం తప్పకుండ ఫిల్టర్ నీటిని ఉంచడం జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కనమడకల వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 10వ తేదీన జాబ్ మేళా




జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల నియోజకవర్గంలోని ప్రభుత్వ పిఎస్‌సి అండ్ కెవిఎస్‌సి డిగ్రీ కళాశాల ఆవరణంలో 2025 ఏప్రిల్ 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, జెకెసి కో ఆర్డినేటర్ పార్వతి, ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్నలు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు 14 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఈ జాబ్‌మేళాలో పాల్గొనడానికి 10, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఫార్మశీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి-జిల్లా వ్యవసాయాధికారి

చాగలమర్రి, మేజర్ న్యూస్ :ప్రతిరైతు ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పని సరిగా పొందాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలి పారు. గురువారం చాగలమర్రి పట్టణం లోని 3వ రైతు సేవా కేంద్రం నందు మం డల వ్యవసాయ అధికారి రంగనేతాజీ అధ్య ర్యంలో వ్యవసాయ,ఉద్యాన సహాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి, ఆళ్ళగడ్డ ఏడీ రామ్మో హన్ రెడ్డి , ప్రకృతి వ్యవసాయ విభాగం డి.పి.ఎం నరేంద్రా రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

కారి మాట్లాడుతూ మండలంలో రైతు విశి ష్ట సంఖ్య నమోదు ఇప్పటికి 66 శాతం మాత్రమే పూర్తి అయిందన్నారు. రైతులకు పూర్తి అవగాహన కల్పించి రెండు రోజుల లో 100 శాతం పూర్తి చేయాలని ఆదేశిం చారు. రైతు విశిష్ట సంఖ్య వల్ల ప్రభుత్వం నుండి వచ్చే అన్నదాత సుఖీభవ, పి.ఎం. కిసాన్, పంట భీమ, పంట నష్ట పరిహారం వంటి పథకాలు పొందాలంటే తప్పకుండా ప్రతి రైతు తమ పొలం కలిగిన రైతు సేవా కేంద్రమును సంప్రదించి నమోదు చేసుకో వాలని లేనిచో పథకాలు వర్తించవని తెలి పారు. కావున రైతు విశిష్ట సంఖ్య యొక్క ప్రాధాన్యత తెలుసుకొని తప్పక నమోదు చేసుకోవాలని దీనికి సంబంధించి రైతు సేవా కేంద్ర సిబ్బంది గ్రామాలలో అవగా హన కల్పించాలని తెలిపారు.

# గోనెగండ్లలో మోస్తారు వర్షం

గోనెగండ్ల, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన గోనె గండ్లతో పాటు గాజుల దిన్నె, హెచ్ కైరవాడి, అలువాల, కులుమాల గ్రామాలలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపుతో కూడిన వర్షం కురిసింది. దీంతో వీధు లు జలమయమైయ్యా యి. గోనెగండ్ల పలు వీధులలో వర్షం నీరు


గోనెగండ్లలో గద్వాల వీధిలో పారుతున్న వర్షపునీరు

పారడంతో జనంకు ఎండ వేడిమినుంచి కొంత ఉపశమనం కలిగింది. మండు వేసవిలో గురువారంమధ్యాహ్నం కురిసినవర్షం జనంకు కొంత ఊరటనిచ్చింది. కొంత మేర భూమి చల్లబడిందని ప్రజలు తెలుపుతున్నారు. రెండు మూడు రోజులు వాతావరణం చల్లగా ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు. దిగువ ప్రాంతంలోని ఇండ్లలోకి వర్షంపునీరు వచ్చి చేరింది.

# పౌరుషానికి ప్రతీక బండలాగుడు పోటీలు..బిసి రాజారెడ్డి

- నందవరంలో వృషభ రాజముల బలప్రదర్శన పోటీలను ప్రారంభించిన బిసి రాజారెడ్డి
- రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను అభినందించిన బిసి రాజారెడ్డి


వృషభరాజ్యముల బల ప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ మేజర్ న్యూస్ : పౌరుషానికి ప్రతీక బండలాగుడు పోటీలను బనగానపల్లె మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. బన గానపల్లె మండలం నందవరం గ్రామంలో ఉగాది పండుగ సంద ర్భంగా శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి రాయభారాది , జ్యోతి, రథ వసంతోత్సవ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం టిడిపి నాయకులు, చౌడేశ్వరి దేవి ఆలయ మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వృషభ రాజ ముల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బిసి రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బండలాగుడు పోటీలను ప్రారం భించారు. అనంతరం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను బిసి రాజారెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి అభి నందనలు తెలియజేశారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తున్న పివి కుమార్ రెడ్డిని అభినందించారు. ఎక్కడా లేని విధంగా రూ.3.50 లక్షలు ఖర్చుచేసి కబడ్డీ పోటీల కోసం ప్రత్యేకంగా మ్యాట్ తయారు చేయించడం అభినందించ దగ్గ విషయం అన్నారు. గ్రామీణ క్రీడలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. నందవరంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను అందరూ ఆద ర్శంగా తీసుకొని క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం శ్రీచౌడేశ్వరిదేవిఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి శ్రీచక్రం వద్ద కుంకుమార్చన చేసి మొక్కులు తీర్చుకున్నా రు. ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో పివి కుమార్ రెడ్డి బిసి రాజారెడ్డిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి రథోత్సవంలో బిసి రాజారెడ్డి పాల్గొన్నారు. ముందుగా సాంప్రదాయబద్ధంగా రథం ముందు పూజలు చేసి భక్తులందరితో కలిసి బిసి రాజారెడ్డి రథాన్ని లాగారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు పీవీ నాగార్జునరెడ్డి, పీవీ శుభంకర్రెడ్డి,టీడీపీ నాయకు లు , కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


# నూతన వధూవరులను ఆశీర్వదించిన కంగాటి శ్రీదేవమ్మ


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్: కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహం గురువారం కర్నూలు నగర సమీపంలోని జిఆర్‌సి కన్వెషన్ నందు వైభవంగా జరిగింది. ఈ వివాహానికి పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మె ల్యే కంగాటి శ్రీదేవమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా వివాహానికి హాజరైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డిని కంగాటి శ్రీదేవమ్మ, రాష్ట్ర వైకాపా కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట కర్నూలు జిల్లా వైకాపా నాయకులు, మాజీ జడ్పిటిసి దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి, వెల్దుర్తి మండల వైకాపా కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి, మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# టీడీపీలో చేరిన మాచాపురం వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ : నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన వైసీపీకినాయకు లు సుధాకర్‌రెడ్డి, నాగరాజులు ఎమ్మె ల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షం లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా వేసి సాధారణంగా ఆహ్వా నించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి పార్టీ అభ్యు న్నతికి, ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, క్లస్టర్ ఇంచార్జి కాసింవలి, ధర్మపురం గోపాల్, పీర్ సాబ్, వలి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీవీ

# ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ తరగతులు ప్రారంభం

పత్తికొండ, మేజర్‌న్యూస్ : పత్తికొండ వైష్ణవి కళాశాలలో ఏబివిపి ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కల్పన, సిఐ పులిశేఖర్ కోచింగ్‌సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో చేరదలచిన విద్యార్థులు ఉచితంగా నిర్వహిస్తున్న ఫ్రీకోచింగ్ సెంటర్‌ను విద్యార్థులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. గ్రామీణ నిరుపేద విద్యార్థులకు చదువుకోవడానికి ఏబివిపి ఆధ్వర్యంలో మంచి అవకాశం కలిపిస్తున్నారని బాగా చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. బిజెపి నియోజకవర్గపు కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల పవన్ కళ్యాణ్, పత్తికొండ నగర కార్యదర్శి అశోక్, రాబర్ట్, రఘు, తదితరులు పాల్గొన్నారు.


కోచింగ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్

# పదవ తరగతి పరీక్షల మూల్యాంకనం ప్రారంభం

:- తాండ్రపాడులోని క్రీడో పాఠశాలలో నిర్వహణ

కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం గురువారం తాండ్రపాడులోని క్రీడో పాఠశాలలో ప్రారంభమైంది. కర్నూలు జిల్లాకు 1,93,747పేపర్లు వచ్చాయి. గురువారం సాంఘీక శాస్త్రం, ఒకేషనల్ మినహా 11081పేపర్ల మూల్యాంకనం జరిగింది. మూల్యాంకనం 5.7శాతం నమోదైంది. మూల్యాంకన కేంద్రంలో ఎటువంటి అసౌకర్యాలు లేకుండ చర్యలు చేపట్టడం జరిగింది. ప్రశాంత వాతావరణంలో మూల్యాంకనం ప్రారంభమైంది. మొదటిరోజు చీఫ్ ఎగ్జామినర్లు 89మంది, 537మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 145మంది స్పెషల్ అసిస్టెంట్లు హాజరయ్యా రు. పదో తరగతి ఓపెన్ పరీక్షలకు సంబంధించి 16220పేపర్లు రాగా గురువారం 1275 పేపర్ల మూల్యాంకనం జరిగింది. వీటికి 15మంది చీఫ్ ఎగ్జామినర్‌లను 82మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను నియమించడం జరిగింది. మూల్యాంకనానికి హాజరైన వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండ విద్యాధికారులు పర్యవేక్షించారని డిఈఓ తెలిపారు.

# సాయిరాం హాస్పిటల్ లో ఉచితంగా ఓపీలు

ఎమ్మెల్యే బీవీ చేతుల మీదుగా దయాలసిస్ సేవలు ప్రారంభం
స్వస్థ గ్రూప్ డైరెక్టర్లు ముల్లా జహీర్, నరసింహా గౌడ్ వెల్లడి


మాట్లాడుతున్న స్వస్థ గ్రూప్ డైరెక్టర్లు

ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ : ఈనెల 6వ తేదీన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని, అలాగే 13వ తేదీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వీవర్స్ కాలని లో స్వస్థ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయి రామ్ నర్సింగ్ హోం లో ఉచితంగా ఓపీలు చూస్తున్నట్లు స్వస్థ గ్రూప్ డైరెక్టర్లు ముల్లా జహీర్,నరసింహ గౌడ్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సాయిరాం నర్సింగ్ హోం ను తిరిగి ప్రారంభించాం. ఇందులో భాగంగా ఏప్రిల్ 7 వ తేదీన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి చేతుల మీదుగా సాయిరాం నర్సింగ్ హోం లో దయాలసిస్ వైద్య సేవలు ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరు లో దయాలసిస్ సేవలు అందుబాటులో ఉండటం వల్ల కర్నూలు ,ఆదోని కు వెళ్ళే అవసరం వుండదు. ఇక్కడే ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా దయాలసిస్ తో పాటు ఇతర సేవలు ను పొందవచ్చు. అలాగే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 20 వరకు ఉచితంగా ఓపీ లు ఉంటాయి. డాక్టర్ రాం పవన్ ( జనరల్ ఎమర్జెన్సీ), డాక్టర్ శివ శంకర్ (అర్థో), లక్ష్మి (ప్రసన్న (గైనకాలజిస్ట్) లు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరోజమ్మ, శివన్నలు పాల్గొన్నారు.

చేనేత మగ్గాలు, వస్త్రాలను

# పరిశీలించిన ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ : చేనేత జౌళి శాఖకు చెందిన ప్రముఖ డిజైనర్ రామచంద్రికతో కలిసి స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి గురువారం వీవర్స్ కాలనీ చేనేత సొసైటీలో మగ్గాలు, తయారుచేసిన వస్త్రాలను పరిశీలించారు. వస్త్రపరిశ్రమ పరిస్థితులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ ఏ డి హెచ్ నాగరాజారావు, స్థానిక చేనేత విభాగం టీడీపీ నాయకులు కామర్తి మిన్నప్ప, నర్సప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ తో పాటు జౌళి శాఖ బృందం

# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీ

బనగానపల్లె రూరల్,మేజర్ న్యూస్ : బనగానపల్లె పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకట్రా ముడు,కాశీం వలి ఆకస్మిక తనిఖీ నిర్వహించి అనంతరం రోగులతో భోజనం నాణ్యత ఎలా ఉన్నాయో అని వారి అభిప్రాయాలు తెలుసుకు న్నారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆహార పదార్థాల శాంపిల్ లను సేకరించి ల్యాబోరేటరికి పంపినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఆర్.యం.ఓ సిహెచ్ శిరీష, నర్సింగ్ సూపరింటెంట్ ఈశ్వరమ్మ, డైట్ కాంట్రాక్టర్ కుసుమ్మూర్ అబ్దుల్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

-రూ.10 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యం అని మండల టీడీపీ నాయకులుబేతాలబడేసా, తిరుపతయ్య నాయుడు, మాజీ సర్పంచ్ ఎర్రబాడు శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎర్రబాడు గ్రామంలో రూ.10 లక్షలతో శివాలయం నుంచి ముల్లా ఖాజా హుస్సేన్ ఇంటి వరకు సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఇప్పటికి మూడు కోట్లు రూపాయలతో మండలంలో సీసీరోడ్డు. డ్రైనేజి పనులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రంగముని, ఫక్రుద్దీన్, షేక్షావలి, మౌలా, కటిక షేక్షావలి, తిరుమలేష్, రామచంద్రగౌడ్, ఏసు, కుమార్, యాగంటి, నాగేష్ పాల్గొన్నారు.

# వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



సాసర్ పీట్లలో నీరు నింపుతున్న అటవి అధికారులు

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** నల్లమల అటవీ ప్రాంతంలో వేసవి కాలం సందర్బంగా వన్యపాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టినట్లు డి. వనిపెంట సెక్షన్ పారెస్టర్ రామకృష్ణతెలిపారు. గురువారం నంద్యాల టైగర్ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ ఆనురాగ్ మీనా,రుద్రవరం సబ్ డిఎఫ్ఓ శ్రీనివాసుల రెడ్డి,రేంజర్ శ్రీపతినాయుడు ఆదేశాల మేరకు అటవీ అధికారులు అటవీ ప్రాంతంలోనిసాసర్పీట్లను నీటితో నింపారు. ఈసందర్భంగా పారెస్టర్ మాట్లాడుతూ వనిపెంట సెక్షన్ పరధిలోని వనిపెంట,పెద్దవంగలి,ముత్యాలపాడు తాండా బీట్లలోని సాసర్పీట్లను నీటితో నింపామన్నారు.దీని వలన వన్యప్రాణులు అడవుల నుండి జనవాసాలలోనికి రాకుండా ఉండడం చేతను మరియు వేసవిలో నీటి ఎద్దడి వలన వాటి దాహార్తిని తీర్చేందుకు ఈ నీరు వన్యప్రాణులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్బీఓలు నాగేష్,సుభాష్,మదన్గోపాల్,ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# పిడుగు పడి బాలుడు మృతి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** పిడుగుపాటుకు ఓ బాలుడు మృతి చెందిన ఘటన ఎమ్మిగనూరు మండలం కందనాతిలో చోటు చేసుకుంది. కందనాతి గ్రామానికి చెందిన కొంతమంది పొలంలో వ్యవసాయ పనుల కోసం కూలికి వెళ్లారు. మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో ఓ చెట్టు కింద వెళ్లి నిలబడగా అకస్మాత్తుగా ఆ చెట్టుపై పిడుగు పడడంతో అదే గ్రామం కు చెందిన రవి (15) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు కేసన్న, తిక్కన్న, శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ శేషఫణి మృతిచెందిన బాలుడు కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరుపున వారికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# రంగారావు గోష్టి ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలం లో శ్రీ రంగారావు గోష్టి వారి ఆధ్వర్యంలో రంగారావు3వ వర్ధంతిని పురస్కరించుకొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదానకార్యక్రమాన్ని అహోబిలం దేవస్థానం అర్చకులు కిడాంబి కుమార్ స్వామి ప్రారంభించారు. అహోబిలం, ఆళ్లగడ్డ లో నృసింహ భక్తులకు 400 మందికి పైగా అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆళ్లగడ్డలో రెండు అనాధ ఆశ్రమాలలో, స్ఫూర్తి మదర్ హెూంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారావుగోష్టి సభ్యులు, ఎలక్ట్రికల్ ఏడిఈ రవికాంత్ చౌదరి, ఫోటోగ్రాఫర్ ఉప్పల ప్రసాదు, వెంకటేశ్వర్లు, మల్లె వీరచంద్ర ,శేషు నాయక్, అంజి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంజనేయపురంలో గుడిసె దగ్ధం- రోడ్డునపడ్డ బాధితుడు

**మహానంది, మేజర్న్యూస్ :**

మహానంది మండలంలోని ఆంజనేయపురం గ్రామంలో గుడిసె కాలి బూడిదైంది. గురువారం రాత్రి విద్యుత్ షాట్ సర్క్యూట్తో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయని బాధితులు పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గాజులపల్లి సమీ పంలో ఆంజనేయపురం కొట్టాలలో మౌళాలి అనే వ్యక్తి పూరిగుడిసె పూర్తిగా కాలిబూడి దైందని అన్నారు. ఇంట్లోని టీవీ, నిత్యావసర సరుకులు, దుస్తులు, బీరువాలోని కొంత నగదు, కొంత బంగారు వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితుడు పేర్కొన్నారు.

# విద్యార్థులు వినూత్న అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**నంద్యాల నూనెపల్లె, మేజర్న్యూస్ :**

నంద్యాల శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ శాఖకు చెందిన రెండు, మొదటి సంవత్సరాల విద్యార్థులకు డేటా సైన్స్పై కార్యక్రమాలను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు టెక్నికల్ ఈవెంట్స్, ఐడియా, లీటకోడ్, ఆప్టిట్యూడ్ టెస్ట్, నాన్ టెక్నికల్ ఈవెంట్స్తో పాటు వివిధ ఈవెంట్స్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో విభాగాధిపతి రమాదేవి, కో ఆర్డినేటర్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది.

# ప్రకృతి వ్యవసాయంపై కార్యాచరణ ప్రణాళిక



సమావేశమైన జిల్లా వ్యవసాయ అధికారి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశం ఆర్ కృష్ణాపురం గ్రామంలో జరిగింది. వ్యవసాయం మరియు అనుబంధ శాఖలు వెలుగు శాఖల అధికారులతో ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం జరిగింది. గ్రామస్థాయిలో రైతులకు సమాచారం మరియు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించుటకు మండల స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యవసాయ వెలుగు శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తోకలిపి సమన్వయంగా గ్రామస్థాయిలో కలిసి రైతుల యొక్క పూర్తి సమాచారాన్ని సేకరించవలసినదిగా ఆదేశించారు. అదేవిధంగా విత్తన గుళికలు వాటి ఉపయోగాలు పిఎండిఎస్ ఉపయోగాలు, 365 రోజులు భూమిని పైరులతో కప్పి ఉంచడం పలు పంటల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఆళ్లగడ్డ ఏడిఏ రామ్మోహన్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్ర రెడ్డి, వెలుగు ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయ గోపాల్, మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, ఎన్ ఎస్ ఏ కరీం భాషా, ప్రకృతి వ్యవసాయ డివిజన్ అధికారులు నాగేశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, తదితర సిబ్బంది ప్రకృతి వ్యవసాయ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# భారత క్రీడా కేంద్రానికి ఎంపికైన నంద్యాల టైక్వాండో క్రీడాకారులు

**ఎంపికైన పవన్ తేజ, జంషీద్ హుస్సేన్లను అభినందించిన డాక్టర్ రవి కృష్ణ**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** భారత క్రీడల శాఖ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ఇండియా) ఆధ్వర్యంలో కర్నూల్ లో ఉన్న టైక్వాండో కేంద్రానికి ఫిబ్రవరిలో జరిగిన ఎంపిక పోటీలలో నంద్యాలకు చెందిన పవన్ తేజ, జంషీద్ హుస్సేన్ తైక్వాండో క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ ప్రత్యేకకేంద్ర ప్రభుత్వ క్రీడా హాస్టల్లో సాధారణ చదువు కొనసాగేలా చూస్తూ, తైక్వాండలో జాతీయ స్థాయి కోచ్ తో శిక్షణ ఇప్పించడం జరుగుతుంది. ఉచితంగా వసతి, భోజన ఏర్పాట్లతో పాటు క్రీడా పోటీలలో పాల్గొనడానికి తీసుకువెళ్లడం, అవసరమైన క్రీడా పరికరాలు సమకూర్చడం కేంద్రమే చేస్తుంది. ఈ ఇద్దరు క్రీడాకారులు తైక్వాండో మాస్టర్లు సుందర్రాజు, మహబూబ్ భాష, ఉదయ్ కిరణ్ శిక్షణలో తర్ఫీదు పొందారు. ఈ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు,కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ సంఘం చైర్మన్ డాక్టర్. రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులకుజ్ఞాపికలుఅందించి అభినందించారు. కోచ్లను శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల క్రీడాకారులు కేంద్ర క్రీడా పాఠశాలలకు ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. క్రీడాకారులు క్రమ శిక్షణతో క్రీడా పాఠశాలలో నిరంతర సాధన ద్వారా కృషి చేస్తే జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్, నంద్యాల జిల్లా పారా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎంపివి రమణయ్య, వెలుగోడు మాజీ జెడ్పిటిసిచింతమానిలాలిస్వామి,కోచ్లు మహబూబ్ బాషా, ఉదయ్ కిరణ్, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు చంద్రమోహన్,ఇమ్మడి రామకృష్ణుడు, లెక్చరర్ సురేష్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరీ దేవీ అమ్మవారి తాత్కాలిక హుండీ ఆదాయం లెక్కింపు

**హుండీ ఆదాయం రూ.4,21,438**



**బనగానపల్లె ,మేజర్ న్యూస్ :** బనగానపల్లె నియోకవర్గంలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు ఉగాది జ్యోతి మహోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి 2 గంటలకు వైభవంగా ప్రారంభమై గురువారం ఉదయం 9 గంటలకి ఆలయంకి చేరుకున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారు భక్తులకి విశేష పుష్పాలంకరణలో దర్శనం ఇచ్చారు. సుమారు 600 జ్యోతిలతోభక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో తాత్కాలిక హుండీ లెక్కించగా రూ.4,21438 లు వచ్చినట్టు ఆలయ అధికారిణి అసిస్టెంట్ కమిషనర్ జి కామేశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ అండ్బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్రెడ్డి ఆదేశాల మేరకు వచ్చిన భక్తులకి త్రాగునీటి సౌకర్యం,నిమ్మకాయ జ్యూస్ , మజ్జిగ,చలువ పందిళ్ళు మరియు అన్ని రకములసౌకర్యాలు, కార్యనిర్వాహణాధికారిణి అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ,మాజీ చైర్మన్ కుమార్ రెడ్డి ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ వారు ప్రత్యేకనిఘాతో భక్తులకి ఎటువంటి ఇబ్బందీ కలగకుండా రక్షణ కల్పించారు. ఈ ఉత్సవాలలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పెట్టెం గురుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణ అధికారిణి కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి ,అసిస్టెంట్ కమిషనర్ మోహన్, పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్, నందివర్గం ఎస్సై,మరియు అధిక భక్తులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాన్ని దిగ్విజయం చేసిన ప్రతి శాఖ వారికి మరియు భక్తులకి కామేశ్వరమ్మ , కుమార్ రెడ్డి ప్రతేక ధన్యవాదాలు తెలిపారు.

# కొనసాగుతున్న విజిలెన్స్ దాడులు

**కర్నూలు క్రైం, మేజర్న్యూస్ :** పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా విజిలెన్స్ అండ్ సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు ఉమ్మడిగా నగరంలో దాడులు కొనసాగిస్తున్నారు. నగరంలోని రెండు రేషన్ షాపుల మీద దాడులు నిర్వహించి రెండు రేషన్ షాపులలో ఒక షాపులో ఉండాల్సిన బియ్యం కన్నా నిల్వ తక్కువ,మరో షాప్లో నిల్వ ఎక్కువగా ఉండడంతో నిత్యవసర సరుకుల చట్టం సెక్షన్ 6ఎ కింద కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఉజ్మకు చెందిన రేషన్ షాపు నెం. 53లో ఉండాల్సిన దాని కన్నా 3290కేజీల(30క్వింటాళ్ల) బియ్యం మరియు 604కేజీల జొన్నలు తక్కువగా ఉండడంతో నిత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ 6ఎ కింద కేసు నమోదు చేశామన్నారు. ఆర్టీసి బస్టాండ్ వెనుక గల షాప్ నెం. 162లో ఉండాల్సిన నిల్వ కన్నా 18క్వింటాళ్ల బియ్యం మరియు 286ప్యాకెట్ల చక్కెర ఎక్కువగా ఉండడంతో అతనిపై కూడా 6ఎ కింద కేసు నమోదు చేశామన్నారు. అయితే గోడౌన్ ఇంచార్జ్ 113వ నెంబర్(సుజీత్ కుమార్) షాపుకు ఈ 18క్వింటాళ్లు బియ్యంతో పాటు 286ప్యాకెట్ల చక్కెరను 162షాపు యజమానిని షాప్ నెంబర్ 113కు తరలించాలని గోడౌన్ ఇంచార్జ్ మ్యానువల్ రికార్డును పంపింది. అయితే అధికారులు ఉండాల్సిన దానికన్నా ఎక్కువగా ఉన్నాయని మ్యానువల్ రికార్డును పరిగణలోకి తీసుకోకుండ 162షాపు యజమానిపై కూడా 6ఎ కేసు నమోదు చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ఈ దాడులు పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేవరకు జరుగుతూనే ఉంటాయని తెలిపారు. ఈ దాడుల్లో నగర సహాయ సరఫరాల అధికారి రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్రెడ్డి, విజిలెన్స్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.



సూర్య



## శ్రీరామ ఆలయానికి వెండి కిరీటాలు బహుకరించిన డోన్ ఎమ్మెల్యే



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల మండల పరిధిలోని శంకరాపురం గ్రామంలో వెలసిన శ్రీరామ ఆలయానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ దంపతులు శ్రీరామ ఆలయానికి గురువారం వెండి కిరీటాలను బహుకరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా శ్రీరామ ఆలయంలో వెలసిన శ్రీరాముడు, సీత,లక్ష్మణుడు,ఆంజనేయ స్వామి విగ్రహాలకు వెండి కిరీటాలు అందచేశారు.వారి రాకకు గ్రామ పెద్దలు,గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు మహామంగల హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు హనుమంతురెడ్డి, శేఖర్, మధు,మహేష్,చిన్న నాగిరెడ్డి,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్టకు హాజరైన డోన్ ఎమ్మెల్యే :** బేతంచెర్ల మండల పరిధిలోని మాండ్లవానిపల్లె గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించిన శ్రీ సుంకుల పరమేశ్వరి,జంబుల పరమేశ్వరి ఆలయ విగ్రహ ప్రతిష్టకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కోట్ల సుజాతమ్మ దంపతులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గ్రామస్థులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : ఎమ్మెల్యే



మిషన్ కుడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో కెనరాబ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (సిబిఆర్‌సెటీ) ఆద్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పొదుపు మహిళా సంఘం సలహాదారురాలు విజయ భారతమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండి కుటుంబాలను ఆర్థికంగా ముందుకు నడపాలన్నారు. అనంతరం టైలరింగ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, సర్పంచ్ గోవర్ధనమ్మ, సెమినా బేగం, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్ట్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించండి

– జాయింట్ కలెక్టర్ నవ్య

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు విమానాశ్రయంలో ప్రయాణికుల కు అవసరమైన మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏరోడ్రోమ్ కమిటి, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ క మిటి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ విమానాశ్రయం ఆవరణలో పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. పండ్ల చెట్లు లేకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా విమానాశ్రయ అభివృద్ధిలో జిల్లా అధికారులంతా సహకారం అందించాలని ఆమె కోరారు. విమానాశ్రయంలో ఉత్పత్తి అయ్యే చెత్తను డంప్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఓర్వకల్లు ఎంపిడిఓను ఆదేశించారు. విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్, డిఎంహెచ్‌ఓ శాంతికల, కర్నూలు డిఎస్‌పి బాబుప్రసాద్, ఐబి డిఎస్‌పి మధు, ఆర్డీసీ ఆర్‌ఎం శ్రీనివాసులు, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి, భూగర్భగనులశాఖ డిడి రవి చంద్ర, ఎలక్ట్రీకల్ డిఇ శేషాద్రి, ఎంపిడిఓ శ్రీనివాసులు సమావేశంలో ఉన్నారు.

# ఘనంగా శ్రీచౌడేశ్వరీ అమ్మవారి జ్యోతి మహోత్సవం

- జ్యోతి మహోత్సవానికి పోటెత్తిన భక్తజనం
- రికార్డు స్థాయిలో జ్యోతుల ఊరేగింపు



బనగానపల్లె, మేజర్ న్యూస్ : బనగానపల్లె మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ కాశీ విశాలాక్ష్మి ప్రతిరూపమైన శ్రీ చౌడేశ్వరీమాత ఉగాది ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన జ్యోతి మహోత్సవం గురువారం ఉదయం జ్యోతులన్నీ ఆలయం ఎదురుగా ఉన్న అగ్నిగుండం ప్రవేశం అనంతరం అమ్మవారి సన్నిధికి చేరుకోవడంతో ముగిసింది. రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ గురువారం ఉదయం నందవరం వచ్చి చెన్నకేశవ ఆలయం వద్దనుంచి జ్యోతిని తలపై పెట్టుకుని పాదయాత్రగా అమ్మవారి సన్నిధికి వెళ్లి ఆలయంలో అమ్మవారిని దర్శిం చుకుని మొక్కు చెల్లించుకున్నారు.ఇదిలాఉండగా ఈ ఏడాది జ్యోతి ఉత్సవంలో పెద్ద సంఖ్యలో జ్యోతులు ఊరేగింపుగా రావటంతో నందవరం పుర వీధులు జ్యోతి దీపోత్సవకాంతులతో కనులపండుగా మారాయి. ఆలయ ఉప కమీషనర్,ముఖ్య కార్యని ర్వాహణాధికారి జి కామేశ్వరమ్మ , మాజీ చైర్మన్ పీవీ కుమారస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో ఈ జ్యోతి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీవిశ్వబ్రాహ్మణ భాస్కరయ్య అమ్మవారికి దృష్టి చుక్క పెట్టడం, అమ్మవారి ఆలయం ఎదురుగా నిప్పును రాజేయడం ద్వారా జ్యోతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. అనంతరం ఈఓ కామేశ్వరమ్మ, ఆలయ కమిటీ వహీకర్త రాజేశ్వరరావు గ్రామంలోని జ్యోతి మండపం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి జ్యోతి ఊరేగింపు ఉత్సవాన్ని ప్రారంభించారు. ముందుగా సర్కార్ జ్యోతి బయలుదేరగా ,అమ్మవారికి మొక్కు చెల్లించేవారు గోధుమపిండి, నెయ్యి ద్రవ్యాలతో జ్యోతిని తయారుచేసి, వివిధారకలుగా అలంకరించి దానిని తలపై వుంచుకుని వాద్య బృందాలు, మేళతాల మధ్య లయబద్దంగా నృత్యం చేస్తూ భక్తిగీతాలు ఆలాపిస్తూ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి 1.30 నుంచి ఉదయం 10 గంటల వరకూ జ్యోతి ఉత్సవం కొనసాగింది. భక్తులు అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అగ్నిగుండంలోని నిప్పుకనికలపై నడచి ఆపై జ్యోతితో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ యేడాది ఎప్పుడూ లేనివిధంగా పెద్దఎత్తున జ్యోతి ఉత్సవం తిలకించేందుకు తరలివచ్చారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పూజలు, గర్భాలయ ప్రవేశాన్ని తాత్కాలికంగా రద్దు చేసి కేవలం అమ్మవారి దర్శనాన్ని మాత్రమే కల్పించారు. జ్యోతి ఉత్సవంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుండా బనగానపల్లె సిఐ ప్రవీణ్ కుమార్, మంజునాథ్ రెడ్డి, నందివర్గం బనగానపల్లె ఎస్సైలు దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బయ్యలు పెద్ద సంఖ్యలో పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. పలు కూరు పి హెచ్సి వైద్యులు వైద్యసేవలు అందించారు.బనగానపల్లె ఆర్టీసీ డిపోవారు భక్తుల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడిపారు. గ్రామ రైతు సంఘం సభ్యులు ఉత్సవాలకు వారివంతు సహకారం అందించారు. ఈ జ్యోతుల ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిచ్చారు. కార్యనిర్వహణాధికారి కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో భక్తుల కోసం తాత్కాలిక వైద్య శిబిరం నిర్వహించారు.

## పీఎం సూర్యఘర్ పథకాన్ని విస్తృత ప్రచారం చేయాలి



పీఎం సూర్యఘర్ పథకాల అమలుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకొనేలా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలలో అవగాహన తీసుకుని రావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి విద్యుత్ అధికారులు, వెండర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పీఎం సూర్యఘర్, కుసుమ్ పథక అమలుపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్మన పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకొనేలా విస్తృత ప్రచారం చేసుకొనేలా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 87,632మంది ఎస్సీ ఎస్టీ వినియోగదారులు సూర్యఘర్ సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. పీఎం సూర్యఘర్ సంబంధించి ప్రతి నియోజక`వర్గంలో 10వేల ఇళ్ళపై సోలార్ పలకాలు ఏర్పాటు చేసేలా లక్ష్యాన్ని నిర్ధేశించారని కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి లక్ష గృహాలకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదే శించారు. ఒక కిలోవాట్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే రూ.30వేలు, 2కిలో వాట్‌లకు రూ.60వేలు, 3కి.వాట్‌కు రూ.78వేలు సబ్సిడీ ఇవ్వడం జరుగు తుందన్నారు. మిగిలిన మొ త్తాన్ని బ్యాంకుల నుంచి రుణం సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రతి ఇంటింటికి వెళ్లి వినియోగదారులకు వివరించేలా సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లను ఆదేశించాలని విద్యుత్ ఈఈ, డీఈలను కలెక్టర్ సూచించారు సోలార్ ప్యానల్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును పవర్‌గ్రిడ్‌కు పంపించి గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా అందించే విషయాన్ని కూడా వినియోగదారులకు స్పష్టంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. పీఎం కుసుం పథకం కింద జిల్లాలో 130విద్యుత్ సబ్ స్టేషన్లకు అవసరమైన స్థలాల సేకరణకు ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ విద్యుత్ అధికారులను కోరారు. మిడుతూరు మండలం కడుమూరు గ్రామంలో 143 ఎకరాల స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈసమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ సుధాకర్ కుమార్, ఈఈ టెక్నికల్ నాగేశ్వర రావు, నంద్యాల ఈఈ శ్రీనివాసులురెడ్డి, ఎల్‌డిఎం రవీంద్రకుమ ఆర్‌లు పాల్గొన్నారు.

## పాఠశాలల బలోపేతానికి కృషి – ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** అక్షరాస్యతలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల బలోనేతానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి రాంపురంలోని స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులతో బాలనాగిరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిఓ నెం. 117 రద్దుతో క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ ద్వారా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల యందు విద్యార్థులకు అనుగుణంగా ఎంతమంది ఉపాధ్యాయుల అవసరం, విద్యార్థులకు మౌళిక సదుపాయాల కల్పన వంటి వివిధ అంశాలపై విద్యాశాఖ అధికారులు సమర్పించిన నివేదికలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వలసలకు వెళ్లితే చదువుకొనే విద్యార్థినీ విద్యార్థులు వలసబాట పట్టకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు మండలాల ఎంఈఓలు రాఘున్న, రామాంజనేయులు, శోభారాణి, సువర్ణ సునీయం, రామ్మూర్తి, మంత్రాలయం మండల కన్వీనర్ భీమారెడ్డి, పిఏ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** విద్యుత్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ నెల 4న శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎపిఎస్‌పిడిసిఎల్ ఈఈ శేషాద్రినాయుడు, ఏడిఈ నాగప్రసాదులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయం పెద్దమార్కెట్, కండేరి, కొత్తపేట, షరాఫ్ బజార్, వడ్డేగేరి, కడక్ పురా, సాయిబాబా దేవాలయం, నాగప్ప వీధి, జిల్లా కోర్టు ప్రాంతం, మించిను బజార్ ప్రాంతాల్లో ఉంటుందని పేర్కొన్నారు ప్రజలందరు సహకరించాలని కోరారు